
ఈవారం కథ



# సందెపొద్దు మేఘం

ఒత్తైన మబ్బుల సందుల్లోంచి మెరుపు వెలుగు కన్పించింది. యెదురుగాలికి ఎగిరిపోతున్న పయిటని నడుం చుట్టూ తిప్పి కుచ్చిళ్ళలో బిగించి వడివడిగా అడుగులు వేస్తోంది హారిత.



"ఈ కాలమింతే. గాలి హడావిడే తప్ప చినుకు రాలదు. దుమ్ముతప్ప మట్టి వాసన పీల్చడమే కాలేదీసారి" అనుకుంటూనే దారికి ఇరువైపులా వున్న మర్రి, టేకు, నేరేడు చెట్లు గుబురుగా వుండడం వలన మార్గం మరీ చీకటిగా, గాలి చాల రొదగా తోస్తోందామెకి. సందె పొద్దు పూర్తిగా వాలిపోయింది.

"ఈ గాలికి ఇల్లూ దూరంగా పారిపోయిందా, ఎంత నడిచినా రాదేం!" అనుకుంటు చీకటికి కొంత బెదిరి నడక వేగం హెచ్చించిందామె. నుదిటపై పడుతున్న జుట్టుని వెనక్కి తోసుకుంటూ "ఈ జుట్టొకటి" అనుకుంటుంటే ఆమె అధరాలపై లేత నవ్వు—మెరుపు పల్కరించినట్టు.

అరక్షణంలో మెరుపు ఆగిపోయింది.

ఆమె నడకలో వేగం తగ్గింది.

కళ్ళలో ఏమవుతుందనే ఆత్రం పోయింది.

"ఆ ఏమవుతుంది. గాలి మరింత జోరుగా వీచొచ్చు. దారికి అడ్డంగా టేకు చెట్టు పడొచ్చు. టేకు కాకపోతే మర్రి చెట్టు. చినుకులు రాలొచ్చు. మెరుపులు మెరవొచ్చు. పిడుగు పడొచ్చు. గాలివాన రావొచ్చు. వరదకి ఇళ్ళు కొట్టుకుపోవచ్చు. ఊళ్ళు ఊళ్ళు నాశనం అవొచ్చు. లేదా దుమ్ము ఎక్కువై పక్కింటి పాంచాలికి ఆస్తమా తిరగబెట్టొచ్చు. నెమలి ఆనందంతో ఆడొచ్చు. కోయిల భయపడి పాడక పోవచ్చు. ఏది ఏమైనా సూర్యుడొస్తాడు. వెన్నెలా వస్తుంది. కాకపోతే ఈ సందె పొద్దు మేఘం కల్గించిన ఆనంద విషాదాలు వారి వారి గుండెల్లోనే వుండిపోతాయ్. ఎవరి బాధా ఆనందం వారిదే. మరొకరికి అర్థం కావ్. మరెవరినీ పల్కరించవ్. ఇంత చిన్న విషయానికి ఎందుకొచ్చిన ఆత్రం. ఎందుకీ భయం. రూపరహితమైన ఆనంద విషాదాలకి చిరునామా వుందా? వుంటే తన ఆనందం నా ఆనందంగా స్వీకరించినప్పుడు, నా విషాదాన్ని తన విషాదంగా అతడెందుకు భావించ లేదు అని అడుగుతాను. అన..." పారిజాత పువ్వుల పరిమళం ఆమెని ఆలోచనల నుంచి బయటకు తెచ్చింది.

"ఇల్లొచ్చింది" అనుకుంటూ తడిక గేటుకి వేసిన తాడు విప్పుతుంటే ఆమె అధరాలపై అల్లరి నవ్వు—అలలపై వెన్నెల్లా.

"ఇన్నేళ్ళు గడిచినా ఎంత కొత్తగా మెదుల్తున్నాయి అతని జ్ఞాపకాలు" అనుకుందామె.

తడికని తాడుతో కట్టి అరుగు ఎక్కుతుంటే వాన మొదలయింది. అరుగు మీద నిలబడి రెండు క్షణాలు గుండెల నిండా మట్టి వాసన పీల్చుకుని తాళం తీసింది.

"దీపం వెల్గించడమా? మానడమా"? అనుకుంటూ హరికేన్ లాంతరు అందుకుంది. బరువుగా వుంది.

"కిరోసిన్ పోయక్కర్లేదు" అనుకొని వొత్తి పెద్దది చేసి వెలిగించింది. చిమ్నీకి కొంత నల్లగా పొగమసి వుండడం వలన వెల్తురు అస్పష్టంగా వుంది.

బియ్యం కడిగి స్టౌవ్‌పై పెట్టింది.

బయటకొచ్చి వర్షపు జల్లుని చూస్తూ నిలబడింది.

శరీరం బరువుగా తోచింది.

వర్షం వచ్చే ప్రతిసారీ శరీరం మనసూ జ్ఞాపకాలే బరువుగా మారిపోతాయి.

అయినా ఇదే చిత్రం. వర్షానికీ అతనికీ ఏం సంబంధం?

వర్షాన్ని కురిపించడం, ఆపడం ఎవరి చేతుల్లోనూ లేనట్టే అతని జ్ఞాపకాలు కలిగించే ఆనంద విషాదాలు తన అధీనంలో లేవ్.

ప్రతి క్షణం గుండెల్లో మెల్లమెల్లగా గుసగుసలాడే తలంపులు మబ్బు పట్టిన వేళ అల్లరల్లరిగా పల్కరిస్తాయ్. ఆ పల్కరింపు భరించలేక నిమగొస్తుంది. కంట నీరు తిరుగుతుంది. ఇనేం ఆ మబ్బుకీ, చినుక్కీ పట్టవ్. పట్టించుకోవ్.

అన్నం మాడిన వాసన.

లోపలికి వెళ్ళిందామె.

గిన్నె దింపింది. స్టవ్ ఆర్పింది.

దీపం ఒత్తి చిన్నది చేసి మంచంపై వాలింది.

బయట అలికిడయింది. ఆమె వెలుపలికి వచ్చింది.

"ఎవరు" అందామె.

"వర్షం తగ్గగానే వెళ్ళిపోతాను" గేటు దగ్గర నిలబడి అన్నాడతను.

"రండి" అందామె.

అతను అరుగు పైకి వచ్చాడు. ఆమె గది గుమ్మం వైపు జరిగింది.

"ఇక్కడికి శ్రీరామ్‌పురం ఎంత దూరం" అడిగాడతను.

"అరగంట ప్రయాణం కాలినడకన" అందామె.

"రిక్షాలు దొరుకుతాయాండి" అడిగాడతను.

"ఇక్కడ రిక్షాలుండవ్. ఇదే మొదటిసారి రావడమా"

"ఆ"

గోడవారగా ఎత్తిపెట్టిన నులకమంచం వాల్చి "కూర్చోండి" అంది.

అతను కూర్చుని "మీరేం చేస్తుంటారు" అని అడిగాడు.

"పంతులమ్మని"

ఎక్కడండీ? ఏ స్కూలండీ"

"ఈ వూర్లో వుంది ఒకే ఒక్క స్కూల్. ఈ ఇంటికి కుడివైపు నుండి అరగంట నడవాలి. అప్పుడొస్తుంది స్కూల్. శ్రీరామ్ నగర్‌లో కూడా ఓ స్కూల్ వుంది. అది ఈ ఇంటికి ఎడమ వైపుంది" అందామె.

"శ్రీరామ్‌నగర్ స్కూల్‌లో టీచర్‌గా ఉద్యోగం వచ్చిందండీ. చేరడానికి వెడుతున్నాను. ఇదేంటండీ ఇదంతా అడవిలా వుంది!" అడిగాడతను.

"అడవిలానే వున్నా మనుషులు చాలామందే వున్నారు. కాకపోతే ఈ మనుష్యులకి కనీస సదుపాయాలు కావాలని, వాటిని ఇవ్వడం తమ కనీస కర్తవ్యమని పట్టణాలలో-నగరాలలో మనుష్యులు మర్చిపోయారు. అందుకే మరో పాతికేళ్ళ తర్వాతైనా ఇది అడివిలానే వుండొచ్చు అందామె.

"మీరొచ్చి ఎన్నాళ్ళయింది" అడిగాడతను.

"పాతికేళ్ళు"

"పాతికేళ్ళలో మార్పు ఏం రాలేదాండీ!

"ఎందుకు రాలేదు. అప్పట్లో చుట్టలు-బీడీలు వాడేవారు. ఇప్పుడు సిగరెట్లు కాలుస్తున్నారు. కల్లు-సారా తాగేవారు. ఇప్పుడు వాటితో పాటు రకరకాల సీసాల చప్పుడూ వినిపిస్తుంది. అప్పట్లో ఓటు వెయ్యడం మాత్రమే తెలుసు. ఇప్పుడు జిందాబాద్ డౌన్ డౌన్ అనడానికి అమ్ముడు పోవడం తెలిసింది. కరెంట్ వస్తే చిమ్నీల పని శ్రమ మూలాన పడుతుందని విద్యుచ్ఛక్తి వద్దని చెప్పి కుటీర పరిశ్రమలని ప్రోత్సహించడం వరకూ జ్ఞానవంతులయ్యారు" అందామె చాల నెమ్మదిగా.

"ఈ ఇంట్లో ఎవరెవరుంటారు" సంభాషణ మళ్ళించాలని అన్నాడతను.

"నేనే"

"ఒక్కరూ వుంటారా" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఏం"

అతడు జవాబు చెప్పలేదు. ఆమె రూపం స్పష్టంగా కన్పించడం లేదు. మాటల్లో స్పష్టత మాత్రం తెలుస్తుంది.

"ఇంత మారుమూల పల్లెలో ఒంటరిగా ఎలా


## ప్రపంచ శాంతి ప్రదాత
## శ్రీమాతాజీ నిర్మలాదేవి గారి హైదరాబాదు ఆగమనం.

సహజమహాయోగ ప్రదాయిని పరమ పూజ్యులు శ్రీ మాతాజీ నిర్మలాదేవి గారు 50 దేశాలనుండి వచ్చుచున్న 500 మంది విదేశీ సహజయోగ ప్రతినిధులతో మద్రాసు, బెంగుళూరుల మీదుగా హైదరాబాదు వేంచేయుచున్నారు.

జాతి, మత, లింగ, వర్ణ, వివక్షత ప్రమేయం లేకుండా లక్షలాది ప్రపంచ ప్రజలు నేడు సహజ యోగాభ్యాసముచే ఆత్మ సాక్షాత్కార ప్రాప్తి పొంది, తద్వారా పరిపూర్ణానంద స్థితిలో ఉన్నారు. దాదాపుగా 50 దేశాల్లోని అన్ని ప్రధానమైన పట్టణాల్లో సహజయోగాశ్రమాలు, యోగకేంద్రాలు వర్ధిల్లుతున్నవి. రష్యాలాంటి దేశ ప్రభుత్వాలు, టర్కీలాంటి మత పరమైన దేశప్రభుత్వాలు కూడా అధికారికంగా సహజయోగాన్ని గుర్తించడం జరిగింది. అంతే గాక కేంబ్రిడ్జ్, ఢిల్లీ లాంటి విశ్వ విధ్యాలయాలు యం.డి పూర్తిచేసిన తరువాత సహజ యోగం పై



పి.హెచ్.డి చేయటానికై అధికారికంగా గుర్తించాయి.

ఆధ్యాత్మిక తత్వం కేవలం పుస్తకాలకే పరిమితమైన ఓ ఊహా జనిత కార్యక్రమం కాదని, ఆధునిక విజ్ఞాన శాస్త్ర పరిధిలో కూడా ఆధ్యాత్మికతా ఫలితాలను పరిశీలించ వచ్చునని నిరూపిస్తూ అలా పరిశోధించి పరిశీలించే స్థాయికి సహజ యోగాన్ని తీసుకువచ్చారు. స్వయంగా ఆధునిక వైద్యశాస్త్రాన్ని అభ్యసించిన పరమ పూజ్యులు శ్రీ మాతాజీ నిర్మలాదేవి గారు.

శ్రీ మాతాజీ సమక్షమున
మీలోని కుండలినీ శక్తి
యొక్క జాగృతి ద్వారా
ఆత్మ సాక్షాత్కార
దివ్యానుభూతిని పొందండి.

సభాస్థలము:- "జల దృశ్యము"
సెక్రటేరియట్ సమీపాన
హోటల్ సరోవర్ ఎదురుగా,
హైదరాబాదు.

తేదీలు :- డిసెంబరు 12, 13,
సా. 6.30 గం.లకు

(సహజయోగ సొసైటీ హైదరాబాదు).

3 PAIGAH COLONY
SECUNDERABAD,
Behind Anand Theater.

వుంటుందో" అనుకున్నాడతను.

వర్షం ఎక్కువయింది. జల్లు వేగం హెచ్చింది.

"లోపలికి రండి. ఇక్కడుంటే తడిసిపోతారు"

అందామె.

ఆమె వెనక అతడూ లోపలికి వచ్చాడు.

దీపం వెల్తుర్లో అతని ముఖం స్పష్టంగా కన్పిస్తుంద.

ఆమెలో కలవరం.

ఇదెలా సంభవం?

ఇలా ఇలా...ఎలా జరిగింది?

నా కళ్ళు మోసం చేస్తున్నాయా?

"మీ పేరు" ఆత్రంగా అడిగింది.

"గౌతమ్"

"మీ నాన్నగారేం చేస్తుంటారు"

"ప్రొఫెసర్"


"ఉపాధ్యాయ వృత్తి వంశ పారంపర్యమా? ప్రొఫెసర్ అయివుండి నగరంలోనే నౌకరి చెయ్యాలనుకోకుండా ఇంత దూరం పంపించారా? మీ నాన్నగారి పేరేంటి" చాల మామూలుగా అడగడానికి ప్రయత్నించిందామె. కాని స్వరంలో చిన్న వుద్వేగం వుంది.

"శరత్. నేను ఉద్యోగం చెయ్యడం నాన్నగారికి ఇష్టమే. నాకే లేదు. ఆ ఎవరు చేస్తారండీ, ఇంత దూరం వచ్చి? అక్కడే ఏదో ఒకటి చూసుకుని వెళ్ళిపోవచ్చు. ఏదో పెద్దాయన నాన్నగారి మాట మన్నించి వచ్చాను" అన్నాడు గౌతమ్.

స్టవ్ వెలిగిస్తూ "అదేంటి బాబు! అలా అనుకుంటే ఎలా? పిల్లలకి చదువులొచ్చేదెలా? మనకి తెల్సిందేదో తెలియని వాళ్ళకి నేర్పించడంలో తృప్తి వుంది. ఓ తమాషా చెప్పనా? ఆధునిక విద్యా శాస్త్రం పిల్లల్ని కొట్టకుండా విద్య నేర్పించమంటుంది కదా.

కానీ ఇటువంటి పల్లెల్లో పిల్లల్ని ఎంత బాగా కొట్టి పాఠాలు చెపితే అంత మంచి టీచర్ అని పేరొస్తుంది. కొట్టకపోతే చేతకాని టీచర్ అనుకుంటారు. ఇది చాల చిన్నగా కంటికి కన్పించకుండా వున్న సమస్య. దీన్ని ఎలా ఎదుర్కోవాలి? ఇలా మన మెదడుకీ-హృదయానికీ ఎప్పుడూ ఇక్కడ సమంటూనే వుంటుంది. దూరం అంటావా? మనవాళ్ళు మన దగ్గర వుంటే దూరం ఏంటి" అందామె.

"అమ్మా నాన్నగారూ వాళ్ళెందుకొస్తారు ఉద్యోగాలుండగా" అన్నాడు. బెండకాయలు ముక్కలు కోస్తూ "పెళ్ళి చేసుకుంటే ఆ అమ్మాయి వస్తుందిగా. తనూ నలుగురికి ఏమైనా నేర్పించొచ్చు. దీనివలన సంపాదించేది తృప్తి మాత్రమే. అంతకంటే ఎక్కువగా డబ్బుని కోరుకుంటే ఇక్కడికి రావడం అనవసరం" అందామె.




అతడు తదేకంగా ఆమెనే చూస్తున్నాడు.

శరీరంపై రవ్వంత బంగారం లేదు. చాలా మామూలు చీర. ఇంట్లో ఖరీదైన సామాను లేదు. అయినా ఆమె ముఖంలో ఎంత కాంతి. అదెలా వచ్చింది?

వంట చేసి అతనికి వడ్డించింది.

వేడి వేడి అన్నం. రసం, బెండకాయ వేపుడు, ఆవకాయ, పెరుగు.

అతడు శరత్ కొడుకనే అభిమానంతో ఆమె మనసు వుప్పొంగిపోతోంది. అంతలోనే చిన్న అసంతృప్తి.

"శరత్ ఎలా వున్నారు" అని అడగబోయి మానేసింది.

ఈ పూటుండి రేపెళ్ళిపోయే కుర్రాడికి అనుబంధాలని ఎందుకు వివరించాలి? అయినా ఏమని వివరిస్తుంది!

గౌతమ్‌కి తన నవ్వారు మంచం ఇచ్చి, గోడవారగా మలకమంచం వేసుకొని ఆమె పడుకుంది.

మధ్యలో గౌతమ్ వైపు చూసింది.

"జోజమ్మునానంద జోజో ముకుంద
రావె పరమానంద రామ గోవింద"—

శృతి చేసుకుంటూంది ఆమె హృదయం.

సుమారు ఇరవై ఆరేళ్ళ క్రితం—

స్త్రీ విద్య నేర్చుకోవడం ఇంకా కొత్తగా వున్న రోజుల్లో—

"నే చదువుకుంటాను. అప్పుడే పెళ్ళి చేసుకోను" అంది హరిత.

తల్లి కళ్ళెర్ర చేసింది.

తండ్రి స్వరం పారేసుకున్నాడు.

మేనత్త బుగ్గలు నొక్కుకుంది.

అయినా హరిత కాలేజ్‌లో జాయిన్ అయింది. ఆ వూళ్ళో ఆడపిల్లలకి ప్రత్యేక కళాశాల లేదు. అయినా ఆమె బెదర్లేదు.

కాలేజ్ ఎలక్షన్లప్పుడు శరత్ పరిచయం అయ్యాడు.

"ముద్దుగారే యశోద ముంగిట ముత్యము వీడు"— అన్నట్టున్న శరత్ "మీరు ఎలక్షన్లలో పోటీ చెయ్యండి" అన్నాడు.

"నేనా" ఆశ్చర్యంగా అడిగింది హరిత.

"ఆ"

"వద్దు లెండి"

"ఏం"

"తిరగాలి. అబ్బా అదంతా పెద్ద తతంగం" అందామె.

"అంతేనా? ఇంట్లో ఒప్పుకోరా" నవ్వుతూ అడిగాడు.

"ఇంట్లో ఒప్పుకున్నారనే కాలేజీలో జాయిన్ అయ్యాననుకున్నారా" అందామె.

"మీకిష్టం అయితే ఓట్ల కోసం మేం తిరగడానికి సిద్ధంగా వున్నాం" అన్నాడు తన మిత్ర బృందం వైపు చూస్తూ.

"నాకాసక్తి లేదండీ" అందామె.

అతను నవ్వి తన క్లాస్ వైపు వెళ్ళిపోయాడు.

* * *

"బొటానికల్ గార్డెన్‌లో మీరేం చేస్తు

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్

# తెల్లమచ్చలు

కొత్త పరిశోధన! తెల్ల మచ్చలు, ఇతర చర్మ వ్యాధులు వున్నవాళ్ళు బాధ పడనవసరం లేదు. అట్టివాటి వివరాలు ఇంగ్లీషులో తెలిపి, రెండు చిన్న సీసాల మందు ఉచితంగా పొందండి. మా మందు వాడడం మీరు ప్రారంభించ గానే మీ తెల్ల మచ్చలు మాయమవడం ప్రారంభమగును. చాలా మంది ఈ విధమైన నివారణ పొందారు. మీరూ ప్రయత్నించి లాభం పొందండి. అర్హతలు, అనుభవం వున్న వైద్యుని ద్వారా చికిత్స పొందండి.

Vaidya B.H.
Mathur (B.H.W)
P.O. Katri Sarai
(Gaya)

# తెల్ల వెంట్రుకలు

హేర్‌డైతో కాదు, మా ఆయుర్వేద నూనెతో చిన్న వయస్సులో వెంట్రుకలు తెల్లపడడం ఆటంకపర్చవచ్చును. మొదలునుండే నల్ల జుట్టు రావడం మొదలై, జుట్టుని తెల్లపడనీయకుండా కాపాడును. ఈ నూనె కళ్ళకి, మెదడునకు లాభదాయకమైనది. వేలమంది లాభం పొందారు. ఈ చికిత్స ద్వారా మీకు ఫలితం దక్కనిచో మీ డబ్బు వాపస్ ఇవ్వబడును. ఒకసారి ప్రయత్నించండి.

ఒక చిన్న సీసా వెల రూ.25/-

మూడు సీసాల వెల రూ.70/-

మూడు సీసాలకి ఒకేసారి ఆర్డర్ ఇస్తే ఒక సీసా ఉచితం.

Vaidya B.H.
Mathur (B.H.J)
P.O. Katri Sarai
(Gaya)


న్నారు" అడిగాడు శరత్.

"మీరెందుకొచ్చారు" అడిగింది హారిత.

"ఏముంటాయో చూద్దామని"

"ఏమున్నాయి"

"నాకీ పూల గురించి పెద్దగా తెలియదండి. అసలు నేనిక్కడికి ఎందుకొచ్చానంటే నాకో ఫ్రెండ్ వున్నాడు. వాడింకా మనలానే చదువుకుంటున్నాడు. అతడి అన్న చదివిస్తున్నాడు. అతడీ మధ్య యాక్సిడెంట్‌లో పోయాడు. అతడి చదువు ఆగిపోకూడదు. మీరు మీకు తెలిసిన వాళ్ళెవరిదగ్గరైనా ఓ నాలుగు ప్రైవేట్లు ఇప్పిస్తే చాల సహాయం చేసినట్టవుతుంది" అన్నాడు శరత్.

"మీకు తెల్సినవాళ్ళు ఎవ్వరూ లేరా" అడిగిందామె.

"ఇంతమందికి చెప్పడానికి టైమ్ సరి పోతుందాండి"

"నే చూసినవి నేనే చెప్పి ఆ డబ్బు వాడికిస్తున్నాను. మీరు చూసినవి అతను చెపుతాడు" అన్నాడు శరత్.

"ఇంత మంచితనాన్ని ఎవరైనా అద్భుతంగా చిత్రిస్తే బాగుండును" అనుకుందామె.

"ఆ వాసనేంటి" అడిగాడతను.

"అదిగో ఆ పూల పరిమళం"

"ఆ పూల పేరేంటి"

"పారిజాతం"

"మా ఇంటినిండా వేస్తాను"

"ఎందుకు"

"పరిమళం చాల బాగుంది" అన్నాడతను.

"మీ ఇంట్లోకి ఏ పూల పరిమళం అవసరం లేదు. మీ మంచితనమే చాలు" అందామె.

"ట్యూషన్స్ చూస్తారా" అడిగాడు.

"చూడడమే కాదు. నేను చెపుతాను" అందామె.

* * *

"విశ్వపతి బాబాయ్ తెచ్చిన సంబంధం ఖాయం చేసేస్తాం" అంది హారిత తల్లి.

హారిత జవాబు చెప్పలేదు.

"ఏం మాట్లాడవ్. రఘుపతి మావయ్య తెచ్చిన సంబంధం కట్నం అడిగారని తిప్పికొట్టావ్. దీనికా కట్నం గొడవ లేదుగా" అంది పెద్దక్క. హారిత వాళ్ళకేం సమాధానం చెప్పకుండా పెరట్లోకి వెళ్ళి వంట సావిరా మెట్లపై కూర్చుని ఆలోచిస్తోంది.

ఎందుకీ మధ్య పెళ్ళి అనగానే శరత్ గుర్తొస్తున్నాడు!

అతడితో మాట్లాడిన మాటలు—అతడు చెప్పిన సంగతులు పదే పదే ఎందుకు స్మరణకి వస్తున్నాయి.

శరత్ ఒక్కడే ఎందుకు గుర్తొస్తున్నాడు. మిగిలిన కుర్రాళ్ళెందుకు గుర్తు రావడం లేదు.

ఆమె మెల్లగా శరత్ ఇంటివైపు బయలు దేరింది. తలుపు తట్టింది.

తలుపు తీసిన శరత్ తల్లిని "శరత్ వున్నారండి" అడిగింది.

"రామ్మారా, వున్నారు" అందామె.

హారిత తన హృదయంలో అటు ఇటూ కదుల్తూ "శరత్ వున్నాడు" అంటూ చప్పట్లు కొడుతున్న సంతోషాన్ని గమనించింది. శరత్‌తో ఐదు నిమిషాలు అవీ-ఇవీ మాట్లాడి "సాయంత్రం టౌన్ హాలుకి రండి. మీతో కొన్ని మాట్లాడాలి" అందామె.

* * *

హారిత తన హృదయ సంఘర్షణని రెండు నిమిషాలలో అతనికి వివరించి "మనం పెళ్ళి చేసుకో దానికి మీకేమైనా అభ్యంతరమా" అంది.

శరత్ తెల్లబోయాడు.

అతడి మనసులో ఎవ్వరూ లేరు.

హారితపై అయిష్టం లేదు.

"నేనెప్పుడూ ఇలా ఆలోచించలేదు" నెమ్మదిగా అన్నాడతను.

"చదువులు పూర్తయ్యాయి. రేపో, ఎల్లుండో అర్జనా మొదలు పెడతాం. మీపై నా అభిప్రాయం చెప్పాను. మీరూ ఆలోచించండి" అందామె.

ఒకటి...రెండు రోజులు గడిచాయ్.

ఇంట్లో హారితపై ఒత్తిడి పెరిగింది.

మూడో రోజు శరత్ ఆమెని కలిసి "మీకు నేనంటే ఎందుకంత ఇష్టం" అని అడిగాడు.

ఆమె అతని ముద్దొచ్చే ముఖాన్ని చూస్తూ "తెలియదండీ" అంది.

"నాకూ మీరంటే ఇష్టమే. కానీ నాకో చెల్లెలు, ఇద్దరు తమ్ముళ్ళు వున్నారు. వాళ్ళ గురించే ఆలోచన" అన్నాడతను.

"వాళ్ళ గురించా" అయోమయంగా అడిగిందామె.

"ఆ మీకు ఓ చెల్లెలూ, తమ్ముడూ వున్నారుగా. మీరీ నిర్ణయానికి ఎలా వచ్చారు" అడిగాడు.

"నా నిర్ణయానికి వాళ్ళకి సంబంధం ఏంటి" అడిగిందామె చిత్రంగా.

"మనిద్దరి కులాలు వేరు. కులాంతర వివాహ

అని మన ఇళ్ళల్లో ఆమోదించరు. మన తర్వాత వాళ్ళకి పెళ్ళిళ్ళు కష్టం" అన్నాడు శరత్.

హారిత బిత్తరపోయింది.

"మీకంటే నాకే కష్టం. ఎందుకంటే నాది మీకంటే పెద్ద కులం" అన్నాడతను. హారిత ఆశ్చర్యం నుండి తేరుకుని "మీరు ఇలా కులాల గురించి ఆలోచిస్తారా? వాళ్ళందరి సంగతి వదిలి మీ విషయం చెప్పండి" అందామె.

"నలుగురూ నడిచే బాట నుండి నే తప్పుకోలేను" అన్నాడు శరత్.

ఆమె ఇంకేం మాట్లాడలేదు.

వివాహం ఆమెకి తప్పనిసరి అన్పించ లేదు. ఆమె శరత్‌ని చాల ఎక్కువగా తన భర్తగా వూహించుకుంది. అతడిలో బలహీనత తెలిసాక కూడా ఆమె అతడిపై వ్యతిరేకతని పెంచుకోలేదు.

మనిషి ఎదగాలా? సమాజం మారాలా?

ఇందులో ఏది అనుకోవాలి? ఆమెకి ఎప్పుడూ ఇది గందరగోళంగానే అన్పిస్తుంది. ఆమె అవివాహితగానే మిగిలిపోయింది.

ఇన్నాళ్ళకి ఇన్నేళ్ళకి శరత్ కొడుకు కన్పించాడు.

నిద్రపోతున్న ఆ కుర్రాడి వైపు చూస్తూ "తండ్రి పోలిక. కాని నిర్ణయాలు తీసుకోవడంలో సమాజానికి విలువివ్వకు. మనసుకి చోటివ్వు" అనుకుందామె.

అయితే ఆమె అనుకుంటున్నట్టు అతను నిద్రపోవడం లేదు. అతడికి ఆమె ఎవరో తెలుసు. ఆమె, తండ్రి ఏ పరిస్థితుల్లో విడిపోయారో తెలుసు.

అతడూ ఆలోచిస్తున్నాడు.

సరిగ్గా పది రోజుల క్రితం అతడికీ, తండ్రికీ మధ్య జరిగిందా గొడవ.

గౌతమ్ క్లాస్‌మేట్ హారతి హుషారైనది - అందమైనది -తెలివైనది. వీళ్ళిద్దరూ చనువుగా వుండడం శరత్ గమనించాడు. అతడా చనువుని ద్వేషించలేదు. దూషించలేదు.

హారతి తల్లిదండ్రులతో మాట్లాడేడు.

వాళ్ళు వీళ్ళిద్దరి వివాహానికి ఆమోదించారు.

హారతికి గౌతమ్ అంటే చాలా అభిమానం. ఆమె ఆనంద మేఘాలలో తేలిపోయింది.

"మీరు నన్నడక్కుండా వాళ్ళతో ఎందుకు మాట్లాడేరు" విసురుగా తండ్రిని ప్రశ్నించాడు గౌతమ్.

"ఇప్పుడేమయింది"? అడిగాడు శరత్.

"హారతిని పెళ్ళి చేసుకునే ఉద్దేశం నాకు లేదు" అన్నాడు గౌతమ్.

శరత్ ఆశ్చర్యంగా చూస్తు "ఏం? ఎందుకని" అని అడిగాడు.

"హారతి నా ఫ్రెండ్ అంతే"

"ఆ విషయం ఆమెకి తెలుసా?"

"ఆ మాత్రం తెలియదా? వాళ్ళకి ఆస్తి లేదు. పైగా చాల అప్పులున్నాయి. నా అంతస్తు చూసి కూడా నేనెలా అటువంటి ఉద్దేశంతో వున్నానని ఆమె అనుకుటుంది? నే సబితాని పెళ్ళి చేసుకుంటాను. వాళ్ళ నాన్నగారితో మాట్లాడండి" అన్నాడు గౌతమ్.

"ఆమె ఎవరు"

"మా కాలేజ్‌లోనే చదువుతోంది. చాల ధనవంతురాలు. కట్నం చాలా ఇస్తారు" అన్నాడు గౌతమ్.

"వాళ్ళు హిందువులు కాదా"

"ఇంకా కులాంతరం-మతాంతరం ఏంటండి. ఇప్పుడంతా డబ్బులోనే వుంది. ఎంత ఎక్కువ కట్నం ఇస్తే అంత గొప్ప" కొత్త సత్యాన్ని అన్వేషించిన వుత్సాహంతో చెపుతున్న కొడుకుని చూస్తుంటే శరత్‌కి చాలా సంవత్సరాల క్రితం తన కులానికి ప్రాముఖ్యం ఇచ్చి ఎలా హారిత హృదయాన్ని గాయపర్చాడో గుర్తొచ్చింది.

ఈనాడు కొడుకు డబ్బుకి విలువిచ్చి మరో అమ్మాయి హృదయాన్ని నలి[illegible]గున్నాడు.

"మనకి వున్నది చాలదా? ఇంకా కట్నాలెందుకు" అన్నాడు శరత్.

"డబ్బు మాత్రమే ఈ సమాజంలో మన స్థాయిని పెంచుతుంది" అన్నాడు గౌతమ్.

"అలా డబ్బుపై ఆశలు పెంచుకోకు. అలా డబ్బుకి విలువివ్వకు" అన్నాడు శరత్.

"నలుగురూ దేనికి ప్రాముఖ్యత ఇస్తారో నేనూ ఆ విషయానికే ఇస్తాను" ఇచ్చితంగా చెప్పాడు గౌతమ్.

అప్పుడు చెప్పాడు హారిత గురించి.

"నే నమ్మను" అన్నాడు గౌతమ్.

"ఆ రోజు కులానికి నే ప్రాముఖ్యం ఇచ్చాను. ఆమె ఈనాటికీ ఎక్కడో దూరంగా ఒంటరిగా మనసుకి నచ్చిన రీతిలో జీవనం సాగిస్తోంది. సమాజం అంటూ మనసుకి విలువ ఇవ్వకుండా నేను ఎంచుకున్న బాటకి-నే ఇష్టపడిన బాటకి మధ్య నలుగుతున్నాను. ఆమె ఎప్పుడూ నాకు గుర్తొస్తూనే వుంటుంది. హారతి నా స్నేహితురాలి కంటే నీకెక్కువే. అటువంటి హారతిని వదిలి డబ్బు కోసం ఎవరినో చేసుకుంటే చాల కష్టపడతావ్. ఆలోచించుకో" అన్నాడు శరత్.

"నేనామెని చూడాలి" అన్నాడు గౌతమ్.

"చూడు. ఏం చెప్పి ఆమెని కలుస్తావో నీ ఇష్టం" అన్నాడు శరత్.

"మీ భ్రమ. ఆమె మిమ్మల్ని ఎప్పుడో మర్చిపోయి వుంటుంది" అన్నాడు గౌతమ్.

శరత్ జవాబు చెప్పలేదు.

గౌతమ్ ప్రయాణం అయ్యాడు.

గౌతమ్ ఆలోచిస్తూనే వున్నాడు.

ఆమె తనని చూసింది.

తండ్రి పేరూ అడిగి తెలుసుకుంది.

ఇంకేం ప్రశ్నించలేదేంటి?

గుర్తు పట్టిందా? లేదా?

తెల్లవారింది.

ఆమె లేచింది. బల్లపై పుస్తకం తెరిచింది. రెండు క్షణాలు తదేకంగా చూసింది. బయటకి వెళ్ళింది.

వాకిలి వూడుస్తున్న సవ్వడి.

అతడు లేచి మెల్లగా పుస్తకం తెరిచాడు.

శరత్ ఫోటో. చాలా పాతది. పుస్తకం మూసాడు.

అతడు బయలుదేరుతుంటే "కాఫీ తాగి వెళ్ళండి" అందామె.

అతడు ముఖం కడుక్కొచ్చాడు. కాఫీ గ్లాసు అందించిందామె.

కాఫీ తాగుతూ వరండాలోకి వచ్చాడు.

నిన్న సాయంత్రం నల్లని మేఘాలతో గందరగోళం చేసింది ఈ ఆకాశమేనా అనిపించేంత అమాయకంగా ఎర్రని ఎండని వెదజల్లుతూంది అంబరం.

సందెపొద్దు మేఘపు ఆర్భాటానికి గుర్తుగా వాకిట్లో ఓ పక్కగా కొమ్మలు విరిగిన జామి చెట్టు కన్పించింది.

కాఫీ తాగడం పూర్తయింది.

అతడు గ్లాసు ఆమెకి అందించాడు.

అమాయకంగా కన్పించే అంబరాన్ని కోపంగానూ,

నిర్లిప్తంగా నేలవాలిన జామి కొమ్మని ప్రేమగా చూస్తూ "నే హారతిని వివాహం చేసు కుంటాను" అని మనసులో అనుకొని గుమ్మంకి ఇవతల వరండా మొదట్లో నిలబడి వున్న ఆమె దగ్గరకి నడిచి వంగి ఆమె పాదాలకి నమస్కరించాడు. ఆమె చప్పున కొస్త వంగి "ఇదేంటి బాబూ! ఆర్తి నిండిన స్వరంతో అతడి భుజాలపై చేతులు వేసి వారించింది.

"నే ఎక్కడికైనా ప్రయాణమై వెళుతున్నప్పుడు మా అమ్మా నాన్నలకి నమస్కరిస్తాను" అని నీళ్ళు నిండిన కళ్ళతో మెట్లు దిగాడు.

విరిగిన జామి కొమ్మ కొత్త చిగురు వచ్చింది.

అలిగిన ఆకాశం మామూలుగా చూసింది.